ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 20 సెప్టెంబరు 2025



● తెనాలి: కొలకలూరులో నిర్మించిన 60 మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్

వాహన మిత్ర.. నత్తనడక

- నిర్దేశించిన గడువుకు పూర్తి కాని ఈ-కేవైసీ
- ఉమ్మడి జిల్లాలో 8333 మంది పెండింగ్
- టెలీ కాన్ఫరెన్స్ పెట్టి సమీక్ష చేసినా చలనం లేదు



తాడికొండ : పాన్నెకల్లులో వాహన మిత్ర ఈ-కేవైసీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ

దసరా నాటికి ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా కింద స్థాయి సిబ్బందిలో పెద్దగా చలనం కనిపించడం లేదు. పెద్దగా కష్ట పడకుండా పాత జాబితా ప్రకారమే అర్హులైన వారితో ఈ-కేవైసీ పూర్తి చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ పని చేయడానికి కూడా క్షేత్ర స్థాయిలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అదేమంటే మీటింగ్‌లు, ట్రైనింగ్‌లు అని చెబుతున్నారు. ఫలితం గా ఉమ్మడి గుంటూరు జిల్లాలో వాహన మిత్ర లబ్ధిదారుల ఈ-కేవైసీ భారీ గానే పెండింగ్‌లో ఉంది. సెప్టెంబరు 19 నాటికి ఈ-కేవైసీ సంపూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ కేవలం 60 శాతం మాత్రమే అయినట్లు లెక్కలు చెబుతున్నాయి.

(చిలకలూరిపేట- ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లాలో వాహన మిత్ర కింద లబ్ధి పొందేందుకు 10146 మంది ఉన్నట్లు గుర్తించారు. వారిలో 6065 మంది ఈ-కేవైసీ పూర్తి అయ్యింది. ఇంకా 4024 మంది పెండింగ్‌లో ఉన్నారు. వాళ్లని కూడా కార్యాలయానికి పిలిపించి ఈ-కేవైసీ పూర్తి చేయించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. అయినా గురు, శుక్రవారాల్లో కొన్ని మండలాల్లో కేవలం ఒకటీ, రెండు ఈ-కేవైసీ మాత్రమే పూర్తి చేశారు. ఈ పరిస్థితి పై సీరియస్ అయిన జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ ఈ-కేవైసీ పూర్తి చేయించేందుకు గ్రామాల్లో పర్యటించారు. పల్నాడు జిల్లాలో మొత్తం 6834 మంది అర్హులైన వారుండగా, 4385 మందికి ఈ-కేవైసీ పూర్తి అయ్యింది. అక్కడ ఇంకా 2421 మంది ఈ-కేవైసీ పెండింగ్ లో ఉంది. బాపట్ల జిల్లా లో 5744 మంది వాహన మిత్ర కు అర్హులైన వారుండగా 3816 మంది ఈ-కేవైసీ పూర్తి అయ్యింది. అక్కడ 1888 మంది ఈ-కేవైసీ చేయించాల్సి ఉంది. వీళ్ల కాక గుంటూరు జిల్లాలో కొత్తగా అర్హులైన వారు 2156 మంది, పల్నాడులో 1444 మంది, బాపట్ల జిల్లాలో 984 మంది ఉన్నారు. వారిలో కూడా ఇంకా చాలా మంది ఈ -కేవైసీ పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తుంది.

ఈ-కేవైసీ కాకపోతే...

వాహన మిత్ర లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 15 వేలు చెల్లించనుంది. ప్రతి ఏడాది దసరా నాటికి ఈ చెల్లింపులు చేస్తామని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించారు .ప్రభుత్వం నిధులు జమ చేయాలంటే ఖచ్చితంగా ఈ-కేవైసీ పూర్తి చేసి ఉండాలి. ఎవరికైతే ఈ-కేవైసీ పూర్తి కాదో వారికి నిధులు జమ కావటం ఆలస్యం అవుతుంది. అటువంటి పరిస్థితిలో కొందరికి నిధులు జమ అయ్యి.. కొందరికి కాకపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంటుంది. ఇదే విషయం గురించి జిల్లా అధికారులు పదే పదే చెబుతున్నా కింద స్థాయి సిబ్బందిలో మాత్రం పెద్దగా చలనం కనిపించడం లేదు.



6లో..

బీచ్ రిసార్ట్స్‌కు భలే గిరాకి!

ఏడాది పొడువున బుకింగ్‌లే

హైదరాబాద్ వాసులే అత్యధికం

మురుగుతో.. మ్యాజిక్

వానొస్తే వరద.. బురద. ఆపై కాలాలతో సంబంధం లేకుండా మురుగు.. అపరిశుభ్రత. ఆ వెంటే దోమలు.. వ్యాధులు. ఇదీ పల్లె జనాన్ని పట్టి పీడిస్తోన్న ప్రధాన సమస్య. నిర్వహణా లోపం.. నిధుల లేమి.. పట్టించుకోని అధికారులు.. ప్రజల్లో లోపించిన అవగాహనతో పల్లెలను మురుగు సమస్య వెంటాడుతోంది. డ్రెయిన్లు నిర్మించినా నిరుపయోగంగా మారి.. మురుగుతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేలా ప్రభుత్వం మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రజారోగ్యానికి ఈ డ్రెయిన్లు దోహదపడను న్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం వాన నీటి సంరక్షణకు ఓ ఉద్యమంలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టినట్లుగానే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని చేపడుతోంది. మురుగు సమస్యలు తీరడంతో పాటు దోమల వ్యాప్తి నిర్మూలన తదితర బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా మ్యాజిక్ డ్రెయిన్లు పల్లె ప్రజలకు మేలు చేకూర్చనున్నాయి. వ్యర్థ జలాలతో పాటు రోడ్లపై వాన నీరు నిలవకుండా వేగంగా.. సులభంగా భూమిలోకి ఇంకిపోయేలా ఈ మ్యాజిక్ డ్రెయిన్లను ప్రయోగాత్మకంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 12 గ్రామాల్లో నిర్మిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మూడు జిల్లాల పరిధిలో 4,345 మీటర్ల పొడవున నిర్మాణం చేపట్టారు.

పర్యావరణ హితం.. ఖర్చు తక్కువ

సాంప్రదాయ కాంక్రీట్ డ్రెయిన్‌కు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో పర్యావరణహితంగా మ్యాజిక్ డ్రెయిన్లు దోహదపడనున్నాయి. కాంక్రీట్ డ్రెయిన్ నిర్మాణానికి 100 మీటర్లకు రూ.4 లక్షలు వ్యయం అవుతుంది. అదే మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం 100 మీటర్లకు రూ.90,000 వ్యయం కానున్నది. పైగా నిర్వహణ ఖర్చు ఉండదు. వ్యర్థ జలాలు భూగర్భంలోకి ఇంకడంతో పాటు కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

ఇక మురుగు మాయం

- పల్లెల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం
- దోమలు, పారిశుధ్య సమస్యలకు చెక్
- తొలిదశలో 12 గ్రామాల్లో 4,345 మీటర్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు నిర్మించారు కానీ చాలా చోట్ల మురుగు కాల్వలు నిర్మించలేదు. దీంతో ఎక్కడికక్కడ మురుగు నీరు రహదారుల్లో నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దోమల వ్యాప్తితో పల్లెవాసులు రోగాల భారిన పడుతున్నారు. రోజుల తరబడి రోడ్ల పై మురుగు, వ్యర్థాలతో కూడిన మురుగు నిలిచి తీవ్రమైన దుర్వాసన అపరిశుభ్రతకు పల్లెలు కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షాల సమయంలో నీటి పారుదల లేక పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లు కూడా మునిగిపోతున్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం వినూత్న మ్యాజిక్ డ్రెయిన్లకు శ్రీకారం చుట్టింది. గతంలో ఇంకుడు గుంతలను విస్తృతంగా నిర్మించినట్లుగానే ప్రస్తుతం మురుగు సమస్యకు చెక్ పెట్టేందుకు.. వ్యర్థ జలాలతో పాటు వాన నీటిని భూమిలోకి ఇంకేలా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణాన్ని పలు గ్రామాల్లో చేపడుతోంది. ఈ తరహా డ్రెయిన్లతో ప్రభుత్వానికి నిధుల ఆదాతో పాటు భూగర్భ జలాలు పెరుగుదల, పారిశుధ్య నిర్వహణ భారం తగ్గనున్నది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ల ఫలితాలు ఆశాజనకంగా కనిపించాయి. దీంతో ఈ తరహా డ్రెయిన్లను అన్ని గ్రామాలకు విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు మ్యాజిక్ డ్రెయిన్‌లోకి చేరిన తర్వాత వడపోత అనంతరం భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భజలాలు కూడా వృద్ధి చెందనున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద మూడు జిల్లాల్లోని 12 గ్రామాల్లో జిల్లా నీటి (మిగతా 6వ పేజీలో)



అద్దంకి మండలం విప్పర్లవారిపాలెంలో నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రెయిన్



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ వద్రాణం, వేదికపై మక్కెన

యూరియాపై ఆందోళనొద్దు

రైతులకు కావాల్సినంత అందిస్తాం ● డీసీఎంఎస్ చైర్మన్ వద్రాణం

గుంటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీసీఎమ్ఎస్ చైర్మన్ వద్రాణం హరిబాబు నాయుడు తెలిపారు. గుంటూరులోని డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సినంత యూరియాను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మార్కెటింగ్ సొసైటీలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల వారీగా ప్రత్యేక మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాగు వ్యయం తగ్గించి ఆదాయం పెంచి రైతు కుటుంబాలు సంతోషంగా ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ సొసైటీ అధ్యక్షులు సహకార బ్యాంకు సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సీఎం కోసం సర్వం సిద్ధం

◆ నేడు మాచర్లలో చంద్రబాబు పర్యటన ◆ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి

మాచర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాచర్ల పట్టణంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ కృష్ణారావు ఉదయం నుంచి సీఎం పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. హెలికాప్టర్ ట్రయిల్ రన్ నిర్వహించారు. బంగ్లా గ్రౌండ్‌లో బహిరంగ సభా వేదిక ఏర్పాట్లను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యకర్తల సమావేశానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పనులను కూడా పూర్తి చేయించారు. సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను స్పెషల్ పార్టీ పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. 1132 మంది పోలీసులతో సీఎం పర్యటనకు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పర్యటన ఇలా..

మాచర్లలో సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌ను అధికారులు శుక్రవారం ప్రకటించారు. శనివారం ఉదయం 10:30 గంటలకు మాచర్ల - సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం వద్దకు తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకుంటారు. 10:45 నుంచి 11:05 వరకు 23వ వార్డు యాదవబజారులో జరిగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. 11:10 నుంచి 11:28 గంటల వరకు ఆర్టీసీ గ్యారేజీ వద్ద సఫాయి కార్మికులు, వైద్య సిబ్బందితో మాటామంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడే స్వచ్ఛతా రథాలను ప్రారంభిస్తారు. 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ప్రజావేదిక వద్ద ఉన్న స్టాల్స్‌ను సందర్శించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. భోజన విరామం తర్వాత 3:35 వరకు ఆటోనగర్ సమీపం లో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 3:40 నుంచి సాయంత్రం 4 వరకు యాదవబజారులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. 4:10 గంటలకు తిరిగి హెలి కాప్టర్‌లో ఉండవల్లికి వెళ్తారని అధికారులు తెలిపారు.



● హెలిప్యాడ్ ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



కలెక్టర్, ఎస్పీలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సిద్ధమవుతున్న సభా వేదిక

చెంతనే కృష్ణమ్మ.. నీటికి చింత

● సారూ.. సమస్యలను పరిష్కరించరూ..

మాచర్ల, పిడుగురాళ్ల: జిల్లాలో కృష్ణమ్మ పరుగులు పెడు తోంది. అయినా కళ్లెదుట నీరు ప్రవహిస్తోన్నా నీటి సమస్యలో అటు ప్రజలు ఇటు రైతులు అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పల్నాడు ప్రాంతంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమ స్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాచర్ల పర్యటనలో స్పందిం చాలని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. ఆయా సమస్యలతో పాటు అబివృద్ధి పథకాలపై స్పందించాలని కోరుతున్నారు. నదీ జలాలను సద్వినియోగం చేయడంపై ప్రణాళికలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాల పరిధి లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను శనివారం మాచర్ల పర్యటనలో సీఎం మంజూరు చేస్తారని పల్నాడు ప్రజలు ఎదురు చూస్తున్నారు. మాచర్లలో తాగునీటి సమస్య, వంద పడకల ఆసుపత్రి, కేంద్రీయ విద్యాలయం, పీజీ కళాశాల ఏర్పాటు, దుర్గి మండలం ధర్మవరంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, కారంపూడి మండలం పేటసన్నిగండ్లలో లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ, మాచర్ల మండలంలో అనుపు - కొప్పునూరు లిఫ్ట్‌కు డిస్ట్రిబ్యూషన్ లైన్లు ఏర్పాటు, దుర్గి మిర్చియార్డును 100 ఎకరాల్లో విస్తరణ, లెదర్ పార్కు పునరుద్ధరణ, జెర్రివాగు స్కీం పునరుద్ధరణ, మాచర్ల మండలం రాయవరం జంక్షన్ వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ఖర్చుతో రైతులకు తంటా

దిగువ భూములకు సాగునీరు అందక వందల అడుగుల్లో బోర్లు వేయడం, దానికి విద్యుత్ కనెక్షన్ మోటర్ల ఏర్పాటుతో లక్షల రూపాయల ఖర్చు రైతులకు భారంగా ఉంది. ఒక్కో రైతు పొలంలో నీటి కోసం పది వరకు బోర్లు వేసుకోవాల్సి వస్తుందంటే సాగునీటి కోసం రైతుల కష్టాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. సగటున ఒక్కో రైతు ఏడాదికి బోర్ల మరమ్మతులకే 2 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుతో బోర్ల ఖర్చుతో పాటు మరమ్మతుల ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంది.



పులిచింతల వద్ద బ్యాక్ వాటర్

అక్రమ మైనింగ్‌పై సర్వే

● కోటప్పకొండలో మట్టి లూటీపై విజిలెన్స్ ● ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందించిన అధికారులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ దృష్టి సారించింది. మట్టి దందాపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన వరుస కథనాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పందించింది. అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దర్యాప్తునకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అక్రమ మైనింగ్ ప్రదేశాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. కోటప్పకొండ దేవస్థాన మాన్యం భూముల్లో అక్రమ మైనింగ్ జరిగినట్లు నిర్ధారించారు. ఈవో చంద్రశేఖర్, ఆర్ఐ, మైనింగ్ అధికారులతో కలసి విజిలెన్స్ సీఐ కే చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. ఏఏ సర్వే నెంబర్లులో మైనింగ్ జరిగింది.. ఆ భూములు ఎవరి కింద ఉన్నాయన్న అంశాన్ని పరిశీలించారు. దేవస్థానం మాన్యం భూములు సుమారు ఆరు ఎకరాల్లో అక్రమార్కులు మైనింగ్ చేసినట్లు గుర్తించారు. గతంలో ఆంధ్రజ్యోతిలో అక్రమ మైనింగ్‌పై వార్త వెలువడిన సమయంలో విజిలెన్స్ అధికారులు దాడి చేసి ఎక్సకవేటర్, లారీని సీజ్ చేసిన సందర్భంగా నిర్వహించిన విచారణలో ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి మట్టి తవ్విన భూములు తనవని చెప్పాడు. అయితే ఆ భూములు కోటప్పకొండ దేవస్థాన భజంత్రీల కుటుంబాలకు కేటాయించినవిగా తాజా సర్వేలో అధికారులు గుర్తించారు. 2012లో అక్రమార్కులు ఆ భూములను కొనుగోలు చేసినట్లుగా పత్రాలు సృష్టించినట్టు తేల్చారు. ఈ భూములు రెవెన్యూ రికార్డుల్లో 22ఏ కింద ఉన్నాయి. మట్టి తవ్వకాలపై అధికారుల విచారణతో అక్రమార్కులు ఖంగుతింటున్నారు. దేవస్థానం ఈవో కూడా అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, ఈవో ఫిర్యాదులపై విజిలెన్స్ విభాగం సమగ్ర దర్యాప్తు చేపట్టింది.



అక్రమ మైనింగ్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, దేవస్థాన, మైనింగ్, రెవెన్యూ అధికారులు

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆహ్వానం

● జ్ఞానభూమి పోర్టల్‌లో కళాశాల లాగిన్ నుంచి దరఖాస్తుకు అవకాశం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థినీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ సాధికారత జిల్లా అధికారి రాజేశ్వరమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరంలో డిగ్రీ నుంచి పీజీ వరకు విద్యను అభ్యసిస్తున్న టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు అర్హులన్నారు. అర్హులైన వారు జ్ఞానభూమి పోర్టల్‌లో కళాశాల లాగిన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కళాశాల లాగిన్‌లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల ఫ్రెష్, రెన్యువల్ ఉపకార వేతనాల ప్రక్రియ నమోదు చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 6 స్టెప్ వెరిఫికేషన్ కోసం సచివాలయాలకు పంపించాలని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఉపకార వేతనం పొందకపోతే కళాశాల వారిని బాధ్యులను చేస్తామని ఆమె తెలిపారు.

మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వృద్ధుడు

● ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

యడ్లపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో గడ్డి మం దు తాగిన ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన యడ్లపాడు మండలం జగ్గాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. జగ్గాపురం గ్రామానికి చెందిన కొణతం బాబూరావు(65) అనే వృద్ధుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు మద్యం తాగాడు. ఆ మత్తులో ఇంట్లోని గడ్డి మందు కూడా తాగేశాడు. గమనించిన స్థానికులు యడ్లపాడు, చిలకలూరిపేటలో చికిత్స అనంతరం గుంటూరుకు జీజీహెచ్‌కు వృద్ధుడ్ని తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. బాబూరావు కుమార్తె సుధారాణి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.



● హరితా బీచ్ రిసార్ట్స్ కాటేజీలు

బీచ్ రిసార్ట్స్‌కు భలే గిరాకీ!

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్య లంక సముద్ర తీరంలోని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కు సంబంధించిన హరితా బీచ్ రిసార్ట్స్‌కు నానాటికి డిమాండ్ పెరిగిపోతోంది. ఏడాది పొడువునా ఆన్‌లైన్ బుకింగ్‌లతోనే కాటేజీలు నిండి పోతున్నాయి. అందులో అత్యధిక శాతం హైద రాబాద్ వాసులే ఉంటు న్నారు. అప్పడప్పుడు మాత్రమే ఆంధ్ర ప్రాంత పర్యాటకులకు అవ కాశం లభిస్తోంది. ఇక్కడ కాటేజీలు తక్కు వ... డిమాండ్ ఎక్కువ.

● ఏడాది పొడువునా బుకింగ్‌లే
● హైదరాబాద్ వాసులే అత్యధికం
● కుటుంబంతో సేద తీరేందుకు వసతులు..



బాపట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సూర్యలంక సముద్ర తీరంలో ఉన్న హరితా బీచ్ రిసార్ట్స్‌లో 30 ఏసీ కాటేజీలు ఉన్నాయి. వీటిల్లో 10 డీలక్స్ ఉన్నాయి. వీటికి అత్యధిక డిమాండ్ ఉంటుంది. సముద్రానికి ఎదురుగా ఉండే ఈ కాటేజీలు శుక్ర, శని ఆదివారాల్లో రూ.6 వేలు, మిగిలిన రోజులు రూ.4,500కు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఏసీ స్టాండెడ్ కాటేజీలు 20 ఉన్నాయి. వీటికి శుక్ర, శని, ఆదివారాల్లో రూ.3,500, మిగిలిన రోజుల్లో రూ2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. న్యూ స్టాండెడ్‌కాటేజీలు 3 ఉన్నాయి . శుక్ర, శని ఆదివారాల్లో రూ.4,500, మిగిలిన రోజుల్లో రూ.3,600కు వీటిని బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కాటేజీలను ఎక్కువగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల వారే ఆన్‌లైన్‌లో బుక్ చే సుకుంటారు. అప్పుడప్పుడు మాత్రమే స్థానిక, ఏపీ ప్రజలకు అవకాశం ఉంటుంది. దీనిని బట్టి కాటేజీలకు ఎంత డిమాండ్ ఉందో తెలు స్తుంది. కాటేజీల డిమాండ్‌ను బట్టి ధరల హెచ్చుతగ్గులు ఉంటాయి.

దారి పొడవునా ఆహ్లాదమే..

బాపట్ల నుంచి సూర్యలంక సముద్ర తీరానికి 8 కిలోమీటర్లు ఉంటుంది. తీరానికి నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్డుకు ఇరువైపు లా పచ్చనిచెట్లు ఆహ్లాదాన్ని పంచుతాయి. ఇక్కడి సముద్ర తీర ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. దీనికి అనుబంధంగా ప ర్యాటకులను ఆకట్టుకునేలా పర్యాటకశాఖ అనేక చర్యలు చేపట్టిం ది. రోడ్డుకు ఇరువైపులా చెట్ల నీడన పర్యాటకులు సేద తీరుతుం టారు. కార్తీకమాసంలో భక్తులు వనభోజనాలు ఇక్కడే చేస్తారు. జీడి మామిడి, జామాయిల్ తోటలు ఆహ్లాదకరంగా ఉంటాయి. కొన్ని వేల ఎకరాలలో చూడ ముచ్చటగా ఉండే ఈ తోటల మధ్య పర్యాటకులు కూర్చొని కుటుంబంతో సరదాగా గడుపుతూ.. భోజ నాలు చేస్తూ ఆటపాటల తో ఆనందిస్తారు. ఈ తోటల నుంచి ప్రభుత్వా నికి ఆదాయం కూడా వ స్తుంది. బాపట్ల సబ్ డి విజన్ పరిధిలో 1,366 హెక్టార్లలో జీడిమామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. వీటిని మరిం త అభివృద్ధి చేసేందుకు అటవీశాఖాధికారులు చ ర్యలు చేపట్టాల్సిన అవస రం ఉంది. అదేవిధంగా యూక లిప్టస్ తోటలు విస్తరించాయి.





ఆధునీకరించిన డీలక్స్ ఏసీ స్టాండెడ్ కాటేజీలు



● సైబర్ దొంగలతో జాగ్రత్త

పర్యాటకంలో సైబర్ దొంగలతో జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. గతంలో రెండు రా ష్ట్రాల పర్యాటక ప్రదేశాలే లక్ష్యంగా మోసాలు జరిగాయి. సూర్యలంక హరితా బీచ్ రిసార్ట్స్ పే రిట సైబర్ మోసం జరిగింది. మేనేజర్ పేరిట హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ ప్రైవేట్ ఉ ద్యోగి కుటుంబంతో కలిసి సెలవుల్లో సూర్యలంకలో గడపటానికి ఏ ర్పాట్లు చేసుకున్నారు. ఆన్‌లైన్ వెబ్ సైట్‌ను ఆశ్రయించారు. హరితా బీచ్ రిసార్ట్స్ పేరిట ఉన్న వెబ్‌సైట్‌లో కాంటాక్ట్ నంబరుకు ఫోన్ చే శారు. దీంతో మేనేజర్ తానేనంటూ సంజయ్‌గుప్తా అనే వ్యక్తి పరిచ యం చేసుకొని... నగదు బదిలి చేయాల్సిన ఖాతా వివరాలు వాట్సప్ చేశాడు. ఇక్కడ బ్యాంకింగ్ సిస్టంలో ఉండే లొసుగులను ఆసరాగా చేసు కున్నారు. నకిలీ నంబర్‌తో డబ్బులు స్వాహ చేశారు. కాబట్టి పర్యాటకు లు ప్రభుత్వ వైబ్‌సైట్‌నే నమ్మాల్సిన అవసరం ఉంది. హరితా రీసార్ట్స్‌కే డబ్బులు జమ చేయాల్సి ఉంటుంది. లేకుంటే మోసపోయినట్లే.



ఏసీ డైనింగ్ హాలు

● రిసార్ట్స్‌లో సౌకర్యాలు

సూర్యలంకలోని బీచ్ రిసార్ట్స్‌లో పర్యాట కులకు అందుబాటులో బార్ అండ్ రెస్టా రెంట్ ఉంది. ఫ్యామిలితో భోజనాలు చేసేం దుకు ఏసీ డైనింగ్ హాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వన భోజనాలు చేసేం దుకు కాటేజిలకు ఎదురుగా ఆహ్లాదక రంగా చెట్లు పెంచారు. కాటేజిల బయ ట కూర్చొని తీరాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. పర్యాటకులకు కా వాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు రిసార్ట్స్‌లు ఆధునీకరించారు.



బీచ్ రిసార్ట్స్‌లోని బార్ అండ్ రెస్టారెంట్

గండాలయ సన్నిధి ఘాట్‌రోడ్డు మూత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా మంగళగిరి గండాలయ సన్నిధి ఘాట్ రోడ్డు ద్వార ప్రవేశాన్ని ఆదివారం తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఈఓ కోగంటి సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేల హౌస్ అరెస్టు



నరసరావుపేటలో గోపిరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

నరసరావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయన పిడుగురాళ్ల వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజనీ, నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి వైసీపీ సమన్వయ గజ్జల సుధీర్ భార్గవరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు. హైదరాబాదు నుంచి వస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని పొందుగల చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్టు చేశారు. నరసరావుపేట నుంచి వాహనాల్లో పిడుగురాళ్ల వెళు తున్న వైసీపీ శ్రేణులను కూడా అరెస్టు చేశారు. వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ చలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కేసులకు భయపడమని, మెడికల్ కళాశాలలు ప్రైవేటీ కరించడాన్ని వ్యతిరేకిస్తామన్నారు.

వైసీపీ హయాంలోనే..

మెడికల్ కళాశాలల నిర్వీర్యం

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే మెడికల్ కళాశాల వ్యవస్థనే నిర్వీర్యం చేశారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. పిడుగురాళ్లలోని బ్రాహ్మణపల్లి వద్ద మెడికల్ కళాశాల మూడేళ్లలో 38 శాతమే నిర్మాణం జరిగిందన్నారు. రెండేళ్లలోపు కళాశాలను పూర్తి చేస్తామన్న జగన్ కేంద్రం నిధులు తప్ప.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి వాటా జమ చేయలేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి నిర్మాణాలను గాలికొదిలేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎక్కడైనా ఒక్క ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే.. ప్రారంభోత్సవం చేయడం సమంజసంగా ఉంటుందన్నారు. సగం పనులు కూడా పూర్తికాని మెడికల్ కళాశాలను అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఏ విధంగా ప్రారంభోత్సవం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు మెడికల్ కళాశాల సందర్శన అంటూ ఓ డ్రామా ఆడుతూ జనాలను వెంటేసుకొని వెళ్లడం ఏంటని నిలదీశారు. వైసీపీ నేతలు ఇంకా బుద్ధి లేకుండా జనాలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని యరపతినేని మండిపడ్డారు. వారెన్ని చేసినా పల్నాడు ప్రజలకు వాస్తవం ఏమిటో.. మెడికల్ కళాశాల నిర్మాణం ఎంతవరకు పూర్తయిందో.. ఇంకెంత కాలం పడుతుందో.. తెలుసని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ నేతలు ఇకనైనా చౌకబారు సందర్శనలు మానుకోవాలని హితవు పలికారు.

మద్యం స్కాం, ప్రాజెక్టులపై..

మాట్లాడలేకే జగన్ అసెంబ్లీకి రావడం లేదు

● శాసనసభలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం, ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంపై సమాధానాలు లేకనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. శుక్రవారం అసెంబ్లీలో జీవీ మాట్లాడుతూ జగన్ సభకు హాజరు కాకపోవడాన్ని తప్పుబట్టారు. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మళ్లించి ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకుంటే దానిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలోనూ వాళ్లు ఇలానే కేసీఆర్‌తో కుమ్మక్కై ప్రాజెక్టులను అడ్డుకున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో సాగు నీటి ప్రాజెక్టులకు చేసిన నష్టాన్ని గణాంకాలతో సహా వివరించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్‌పై రూ.79,742 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. వైసీపీ పాలనలో ప్రాజెక్టులకు రూ.22వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, ఇప్పటికే రూ.34,724కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12,441 కోట్లు ఖర్చు చేస్తే.. జగన్ కేవలం రూ.2 వేల కోట్లే ఖర్చు చేశారని వివరించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, పోలవరం పూర్తి చేయాలి అన్న లక్ష్యంతోనే ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, గోదావరి-బొల్లాపల్లి-బనకచర్ల ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామన్నారు.

'జ్యోతి' జీవితంలో వెలుగులు నింపిన లోకేశ్

● అంధురాలి కథనాన్ని 'ఎక్స్' లో పోస్టు చేసిన మంత్రి
● వెంటనే స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా
● టిడ్కో ఇల్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగానికి ఆదేశాలు
● జ్యోతి కుమారుడుకి జీజీహెచ్‌లో వైద్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



'ఆంధ్రజ్యోతి' కథనాన్ని 'ఎక్స్' లో పోస్టు చేసిన మంత్రి నారా లోకేశ్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): జీవితం లో కష్టం తప్ప సంతోషం జాడలేని అంధురాలు పాములపాటి జ్యోతి జీవితంలో మంత్రి నారా లోకేశ్ వెలుగులు నింపారు. 'పాపం..జ్యోతి' అనే శీర్షికన ఈ నెల 17 న 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో ప్రచురితం అయిన కథనానికి ఆయన స్పందించారు. అదే కథనాన్ని మంత్రి లోకేష్ శుక్రవారం తన 'ఎక్స్' లో పోస్టు చేశారు. బాధితురాలికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. మంత్రి 'ఎక్స్' పోస్టుపై వెంటనే స్పందించిన గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులను పాత గుంటూరులోని జ్యోతి ఇంటికి పంపించారు. అధికారుల వాహ నంలో జ్యోతి ని కలక్టరేట్‌కు పిలి పించి ఐదు శాఖల ఉన్నత అధి కారులతో సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సమా వేశంలో జ్యోతి అసలు ఏమి కోరుకుంటుంది అన్న దానిపై ఆరా తీశారు. తనకు ఉండటానికి ఇల్లు, కుమారుడిని చదివించుకోవటానికి ఉద్యోగం కావాలని జ్యోతి కోరింది. ఆమె కోరిన విధంగా పశు సంవర్ధక శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని ఆ శాఖ ఇన్‌చార్జి జేడీ సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. టిడ్కో గృహా లలో ఒక ప్లాట్‌ను కూడా వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాస్‌కు సూచించారు. జ్యోతి కుమారుడు రక్షణ కుమార్‌కు ఊపిరి తిత్తుల్లో నెమ్ము ఉందని తెలుసుకున్న కలెక్టర్.. వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.దుర్గాబాయి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పీ పీ జీ ప్రసూన, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎం.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు రుణపడి ఉంటా..



తన దయనీయ దుస్థితిపై వెంటనే స్పందించి, చర్యలకు ఆదేశించిన మంత్రి నారా లోకేశ్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పాముల పాటి జ్యోతి అన్నారు. లోకేశ్‌ను కలిసేందుకు గతంలో ప్రయత్నం చేశానని తెలిపారు. ఇప్పుడు ఆయనే జోక్యం చేసుకొని తన వద్దకు జిల్లా అధికారులను పంపారని ఆనందం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కూడా తన దుస్థితిపై చక్కగా స్పందించి అన్ని వివరాలు అడిగి తెలుసుకొని.. కొండంత ధైర్యం నింపారన్నారు. ప్రభుత్వం తన విషయంలో చూపించిన ప్రత్యేక శ్రద్ధకు సంతోషం కలిగిందని జ్యోతి పేర్కొన్నారు.

సైకిలెక్కిన ఎమ్మెల్సీ మర్రి

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి



సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరిన మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సీఎం చంద్రబాబు నాయుడి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. మర్రి రాజశేఖర్ ఆరు నెలల క్రితమే వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అయితే రాజశేఖర్ ఎమ్మెల్సీ రాజీనామాను కౌన్సిల్ చైర్మన్ ఇప్పటికీ ఆమోదించలేదు. విషయం సానుకూలంగా ఖరారైనప్పటికీ రాజశేఖర్‌ను టీడీపీలోకి చేర్చుకునే విషయం చాలా రోజులు పార్టీలో నలిగింది. మర్రి చేరికతో టీడీపీలో కొంతమంది అసంతృప్తిగా ఉన్నారని సమాచారం.

పర్యాటక కేంద్రంగా.. బౌద్ధ స్థూపం

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పురాతన బౌద్ధ స్థూపాన్ని పర్యాట క కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పే ర్కొన్నారు. శుక్రవారం భట్టిప్రోలులోని బౌద్ధ స్థూ పం వద్ద పురావస్తు శాఖ అధికారులతో కలిసి అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ స్థూపం వ ద్ద గతంలో రూ.60 లక్షలతో నిర్మాణాలు చేపట్టిన భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఆయా నిర్మాణాలకు తన ఎంపీ నిధులను వె చ్చిస్తానన్నారు. రహదారి అభివృద్ధి, భవనం ప్ర హరీ నిర్మాణం, పర్యాటక బుద్ధిస్టుల కోసం వి శ్రాంతి గది నిర్మించాలని అధికారులకు సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుం ట్ల సాయిబాబు, ఏపీ టూరిజం ఎగ్జిక్యూటివ్ ఎం.శ్రీనివాసరావు, పురావస్తు శాఖ కన్సర్వేటర్ పి. వంశీ పాల్గొన్నారు.

మురుగుతో.. మ్యాజిక్

(5వ పేజీ తరువాయి)

యాజమన్య సంస్థ పర్యవేక్షణలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు.

పైలెట్ ప్రాజెక్టు కింద ఈ గ్రామాల్లో..

● పల్నాడు జిల్లా: దుర్గి మండలం ఓబులేసుని పల్లెలో రెండు చోట్ల మూడు వందల మీటర్ల పొడవున నిర్మిస్తు న్నారు. ఈపూరు మండలం గుండేపల్లిలో 200 మీటర్లలో రెండు కాల్వలు, క్రోసూరు మండలం గాదివారిపాలెంలో 166 మీటర్లలో మూడు, నాదెండ్ల మండలం బుక్కాపురంలో 150 మీటర్లలో ఒక డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు.

● బాపట్ల జిల్లా: అద్దంకి మండలం విప్పర్లవారి పాలెంలో 410 మీటర్లలో నాలుగు కాల్వలు, చిన గంజాం మండలం నీలయ్యపాలెంలో 600 మీటర్లలో ఐదు, మార్టూరు మండలం చిమ్మిరిబండలో 700 మీటర్లలో ఏడు, వేమూరు మండలం పోతుమర్రులో 885 మీటర్లలో తొమ్మిది పనులు చేపట్టారు.

● గుంటూరు జిల్లా: దుగ్గిరాల మండలం చింతల పూడిలో 350 మీటర్లలో నాలుగు డ్రెయిన్లను నిర్మిస్తున్నారు. మేడికొండూరు మండలం మంగళగిరిపాడులో 334 మీటర్లలో ఐదు, ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో 190 మీటర్లలో రెండు, తెనాలి మండలం కొలకలూరులో 60 మీటర్ల పొడవున ఒక మ్యాజిక్ డ్రెయిన్ చేపట్టారు.

నిర్మాణం ఇలా..

గ్రామాల్లో రోడ్డుకు పక్కన మురుగు కాల్వ స్థానంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు. ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు నేరుగా భూమిలోకి ఇంకే విధంగా ఈ కాల్వ నిర్మిస్తారు. వ్యర్థపు నీరు ఆ ఇంటి సమీపంలో నిల్వకుండా మరో చోటకు ప్రవహించకుండా చేస్తారు. ఇందుకోసం మ్యాజిక్ డ్రెయిన్‌లో రెండు అడుగుల లోతు, అరమీటరు వెడల్పుతో కాల్వ తవ్వుతారు. కాల్వకు 50 మీటర్లకు ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేస్తారు. కాల్వలో కింద నుంచి పైకి గ్రేడెడ్ రాళ్లు, కంకర, ఇసుక వంటి పొరలను ఏర్పాటు చేస్తారు. ఇళ్ల నుంచి వచ్చే నీటిని మళ్లిస్తారు. వ్యర్థ జలాలు సహజంగా వడకట్టుతో భూమిలోకి ఇంకుతాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

'మదనపల్లె ఫైల్స్' కేసులో

మాజీ ఆర్డీవో మురళి అరెస్టు

» చిత్తూరు కోర్టులో హాజరు.. 3 వరకు రిమాండ్

తిరుపతి(నేరవిభాగం)/చిత్తూరు లీగల్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మదనపల్లె ఫైల్స్' కేసులో మాజీ ఆర్డీవో మురళీని సీఐడీ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ముందస్తు బెయిల్‌ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తిరుపతిలోని ఇంట్లో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిత్తూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరచగా, వచ్చేనెల 3వ తేదీవరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి బాబాజాన్ ఆదేశాలిచ్చారు. దీంతో పోలీసులు మురళిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో గతేడాది జూలై 21వ తేదీ రాత్రి మంటలు చెలరేగి డాక్యుమెంట్లు కాలిపోయిన విషయం తెలిసిందే.

ధరలేక ఉల్లి రైతు దైన్యం: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బెనిఫిట్ షోలకు టికెట్ ధర రూ.వెయ్యికి పెంచడంలో ఉన్న శ్రద్ధ.. ఉల్లి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం కూటమి ప్రభుత్వానికి లేదు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం అన్నారు. 'ఉల్లి రైతును ప్రభుత్వం నిండా ముంచేసింది. రైతుకంట కన్నీళ్లు పెట్టించిన పాపం సీఎం చంద్రబాబుదే. ధరలేక దైన్యంగా ఉన్న ఉల్లిరైతు కళ్లల్లో ఆనందం ఎక్కడుంటుంద'ని షర్మిల ప్రశ్నించారు.

పనితీరు బాలేదంటూ వీఆర్వోలతో గుంజీలు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పనితీరు బాగలేని వీఆర్వోల చేత శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ గుంజీలు తీయించారు. ఈనెల 18న పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఆర్డీఓపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వీఆర్వోలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆర్డీఓతో మాట్లాడుతానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

రాష్ట్రీయ జన సంక్షేమ సేన స్థాపన: చేగొండి

పాలకొల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం కేంద్రంగా రాష్ట్రీయ జన సంక్షేమ సేన అనే నూతన సామాజిక సంస్థను ఏర్పాటు చేసినట్టు మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య శుక్రవారం ప్రకటించారు.

ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లండి

» వైసీపీ నేత ప్రతాప్‌కుమార్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కావలి టీడీపీ ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి హత్యకు ప్రణాళిక రచించారనే ఆరోపణలపై నమోదైన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టును ఆశ్రయించేందుకు ఆయనకు వెసులుబాటు ఇచ్చింది. ఉత్తర్వుల ప్రతి అందిన నాలుగువారాల్లో కింది కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. అప్పటివరకు ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఆదేశించారు.

కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్ల కొట్టివేత

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడంపై నమోదైన కేసులో ఇద్దరు నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ కేసులో ఏ13 బోలేబాబా కంపెనీ ఆపరేటర్ సంజయ్‌చౌహాన్, ఏ8 షమీ ఉల్లాఖాన్ నెల్లూరు జిల్లా ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లను దాఖలు చేశారు. దీనిపై ఈనెల 16న జరిగిన విచారణలో ప్రభుత్వం తరఫున ప్రత్యేక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనల అనంతరం నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టి వేస్తూ కోర్టు తీర్పునిచ్చింది.



శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళంలో హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి

» అభినందనలు తెలిపిన మంత్రి లోకేశ్

శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. చాలా సమయం పాఠశాలలో గడిపిన ఆయన స్పందిస్తూ... 'నేను ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను దత్తత తీసుకుంటున్నా. హైస్కూల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా' అని ప్రకటించారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందించారు. హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు అభినందనలు తెలిపారు. ఇదే రీతిన వివిధ వర్గాలు పాఠశాలల అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. అందరం కలసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఆదర్శంగా నిలుపుదామంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

సంక్షేమాధికారి బూతుపురాణం

» ఉద్యోగులకు దూషణలు, వార్నింగ్‌లు
» మహిళా అధికారులపైనా ఇదే తీరు
» వారి దుస్తులపై వ్యాఖ్యలు
» తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి నిర్వాకం
» విద్యార్థినులపైనా హేయమైన భాష
» గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేల ఫిర్యాదు
» శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తానన్న మంత్రి డోలా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులను బూతులు తిట్టడం, ఉద్యోగం తీసేయిస్తానంటూ వార్నింగ్‌లు ఇవ్వడం, మహిళా ఉద్యోగులనీ చూడకుండా అసభ్యంగా మాట్లాడటం, డ్రెస్సులపై కామెంట్లు చేయడం, చివరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపైనా నోరు పారేసుకోవడం... ఇదీ తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి తీరు. తిరుపతి జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లను గాడిలో పెడతారని రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో ఆ మధ్య నియమించిన ఆ అధికారి హద్దుమీరి ప్రవర్తిస్తున్నారు. ఆయన చేస్తున్న వింత, విచిత్ర విన్యాసాలు ఇటు సిబ్బందికి, అటు విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. విక్రమ్‌రెడ్డి వ్యవహారశైలిపై ఏపీ స్టేట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోషియేషన్ తిరుపతి జిల్లా యూనిట్ ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మరింత రెచ్చిపోతున్నారు. ఫిర్యాదు చేసిన సిబ్బందిపైనే గాక ఎమ్మెల్యేలపైనా నోరుపారేసుకున్నారని చెబుతున్నారు. జూమ్ మీటింగ్‌ల్లో సైతం ఉద్యోగులపై బూతుపురాణాలు మొదలు పెట్టారు. హాస్టళ్లలో ఉండే బాలికలు, అధికారుల పట్ల నోటికొచ్చినట్లు దూషణలకు దిగుతున్నారు. తనపై ఫిర్యాదు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని, శాశ్వతంగా ఉద్యోగాలకు దూరమవుతారని బెదిరిస్తున్నారు. తనకు మంత్రి పేషీ అధికారులు తెలుసని, కలెక్టర్ మిత్రుడని, ఏసీబీ అధికారులు తనకు సీనియర్లని పదే పదే బెదిరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. తిరుపతి జిల్లాకు అధికారిగా నియమించినప్పటి నుంచి ఆయన వైఖరి ఇలాగే ఉందని అంటున్నారు. పత్రికలో రాయలేని రీతిలో బూతులు తిడుతున్నారని వాపోతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మహిళా ఉద్యోగులు, బాలికలు మంచివాళ్లు కాదంటూ పదే పదే కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ హాస్టళ్లలో చదివే విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల పట్ల కూడా అనుచితంగా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారిందంటున్నారు. ప్రతి సందర్భంలోనూ కలెక్టర్ తనకు బాగా దగ్గరని, ఏసీబీ డీఎస్పీ తనకు సీనియర్ అని, అందరి జాతకాలు తీస్తానని బెదిరిస్తున్నారని, తాము ఉద్యోగాలు మానేసుకోవాలని అనిపిస్తోందని పలువురు మహిళా అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతస్థాయి సమావేశంలో కలెక్టర్ ఆయనను వెనకేసుకు రావడంతో మరింత రెచ్చిపోతున్నారు. కలెక్టర్ ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పచెప్పడంతో దానికి సంబంధించిన పనులు కూడా హాస్టల్ అధికారులకు అప్పగిస్తూ వారిపై స్వారీ చేస్తున్నారు. ఆయన మాటకు ఎవరైనా ఎదురు తిరిగితే అంతే సంగతులు. షోకాజ్ నోటీసులు, మెమోలు ఇస్తానని, సస్పెండ్ చేస్తానని బెదిరింపులు ఎక్కువయ్యాయని చెబుతున్నారు. ఇటీవల బదిలీల సందర్భంగా కూడా సిబ్బందిని ఇష్టం వచ్చినట్లు ఆడుకున్నారని, నాలుగో తరగతి సిబ్బంది అంటే ఈ అధికారికి చిన్నచూపని, ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని ఆరోపిస్తున్నారు. హాస్టల్ మహిళా అధికారుల డ్రెస్సులపై కామెంట్లు చేయడం, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని చెబుతున్నారు. తన బూతుపురాణం ఎవరైనా రికార్డు చేస్తారేమోనన్న అనుమానంతో ఆయన ఆంక్షలు పెడుతున్నారు. ఈ అధికారి వద్దకు వెళ్లాలంటే ఉద్యోగులు ఫోన్లు బయట పెట్టి పోవాల్సిందేనట. తిరుపతి, చిత్తూరు జిల్లాల వారికి కలిపి జూమ్ మీటింగ్ పెట్టినప్పుడు వసతి గృహాలలో జరిగిన చిన్నచిన్న సంఘటనలు ప్రస్తావించి, సిబ్బందిని అవహేళన చేసి పైశాచిక ఆనందం పొందారని ఆరోపిస్తున్నారు. తిరుపతి జిల్లా ఏసీబీ, విజిలెన్స్ అధికారులు తనకు మిత్రులని, వారికి చెప్పి విచారణ జరిపించి అంతుచూస్తానని, ఉద్యోగాలు లేకుండా చేస్తానని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ప్రొటోకాల్ ఖర్చులు ఇవ్వని హాస్టల్ అధికారులకు చుక్కలు చూపిస్తానంటూ వార్నింగ్ ఇస్తున్నారు.

మంత్రికి ఎమ్మెల్యేల ఫిర్యాదు

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతికి వచ్చిన ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్.. సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌రెడ్డిపై మంత్రికి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఈ అధికారి నిర్వాకంపై ఫిర్యాదు చేశారు. పేద ఎస్సీ విద్యార్థులను పర్యవేక్షించాల్సిన అధికారిగా ఇలాంటివారిని నియమించడం వల్ల హాస్టళ్లు మరింత దిగజారుతున్నాయని ఎమ్మెల్యేలు అన్నారు. ఈ అధికారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తామని, ఆయన స్థానంలో మరో అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

హాయ్‌ల్యాండ్‌లో దిద్దేందుకు కోటి ఖర్చు!

» డిజిటల్-మాన్యువల్ మూల్యాంకనాల్లో పెద్ద తేడా
» 62 శాతం మంది మాన్యువల్‌లో ఎంపిక కాలేదు
» తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు ధర్మాసనం



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసి, తాజాగా పరీక్ష నిర్వహించాలని ఏపీపీఎస్సీ, పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఇరుపక్షాలలో ఎవరైన రాతపూర్వక వాదనలు దాఖలు చేయాలనుకుంటే సోమవారంలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించింది. అయితే, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని అప్పటి విచారణలోనే న్యాయమూర్తి నిర్ధారించారు. దీంతో 2022, మే 26న ఇచ్చిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష అర్హుల జాబితాను హైకోర్టు సింగిల్ జడ్జి రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని 2024, మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు అప్పీల్ చేశారు. మరికొందరు.. సింగిల్ జడ్జి తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ వేశారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు తుది విచారణ ప్రారంభించింది. గురువారం ప్రారంభమైన వాదనలు శుక్రవారం కొనసాగాయి. ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు జంధ్యాల రవిశంకర్, కేఎస్ మూర్తి, న్యాయవాదులు జొన్నలగడ్డ సుధీర్, షేక్ సలీమ్ వాదనలు వినిపించారు. డిజిటల్ విధానంలో జరిగిన మూల్యాంకనంలో ఎంపికైన అభ్యర్థులలో 62శాతం మంది తదుపరి జరిపిన మాన్యువల్ మూల్యాంకనంలో ఎంపిక కాలేదన్నారు. తెలుగు మాధ్యమంలో పరీక్షరాసిన అభ్యర్థులే ఎక్కువ నష్టపోయారని తెలిపారు. డిజిటల్ మూల్యాంకనంలో ఎంపికకాని అభ్యర్థులు, మాన్యువల్ మూల్యాంకనంలో మంచి పోస్టులు పొందారని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసేందుకు జవాబు పత్రాలను 'హాయ్‌ల్యాండ్'కు తరలించారని, మాన్యువల్ మూల్యాంకనాన్ని థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించారని తెలిపారు. అయితే, ఇలా ఇవ్వడాన్ని ఏపీపీఎస్సీలోని ఓ సభ్యుడు వ్యతిరేకించారన్నారు. ఈ అభ్యంతరాలను అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పట్టించుకోలేదని, స్ట్రాంగ్ రూమ్ నుండి జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించడం అనుమానించాల్సిన విషయమని వివరించారు. 2021, డిసెంబరు- 2022, ఫిబ్రవరి మధ్య హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందని, దీనికిగాను అదనంగా బార్‌కోడ్లు, ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్‌ను ప్రింట్ చేయించారని తెలిపారు. అయితే ఆ ఫలితాలను ప్రకటించలేదన్నారు. "హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం కోసం మొత్తం రూ.1.19 కోట్లు ఖర్చు చేశారు. డిజిటల్ మూల్యాంకనం, మాన్యువల్ మూల్యాంకనంలో కొద్దిశాతం మాత్రమే వ్యత్యాసం ఉందని, త్వరలో ఫలితాలు ప్రకటిస్తామని అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రకటించారు. వీటన్నిటినీ పరిశీలిస్తే హాయ్‌ల్యాండ్ వేదికగా పేపర్లు దిద్దారనేది స్పష్టమవుతోంది. కొన్ని జవాబుపత్రాలలో రెండు చేతిరాతలు ఉన్న వ్యవహారంపై దర్యాప్తు కమిటీ ఏం తేల్చిందో స్పష్టత లేదు. మెయిన్స్ రద్దు చేసి తాజాగా పరీక్ష నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వండి. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి లేదా సీబీఐ లేదా ఏదైనా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని నిర్ణయానికి వస్తే... అధికారులుగా వివిధ హోదాల్లో ఉన్న అభ్యర్థులను ఆ స్థానాల నుండి తొలగించండి." అని వాదనలు వినిపించారు.

వారు ఎంపిక కాలేదు: ఏజీ

ఈ సందర్భంగా ధర్మాసనం అడిన పలు ప్రశ్నలకు ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ బదులిస్తూ.. రెండు రకాల చేతిరాతలు ఉన్న జవాబుపత్రాల అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలో ఎంపిక కాలేదన్నారు. రెండు చేతిరాతల వ్యవహారాన్ని తేల్చేందుకు ఏపీపీఎస్సీ కమిటీ వేసిందని, కమిటీ నివేదికను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. కోర్టు తుది తీర్పుకి లోబడి ఉంటామని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు హామీ పత్రం ఇచ్చారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, పి. శ్రీరఘురాం, ఓ. మనోహర్‌రెడ్డి రిప్లై వాదనలు వినిపించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



మోటార్ బైక్ రేసర్‌గా శర్వా

శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్ కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. మాళవిక నాయర్ కథానాయిక. బ్రహ్మజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో శర్వానంద్ మంచి నైపుణ్యాలున్న మోటార్ బైక్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోన్న షూటింగ్‌లో శర్వా బృందంపై రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. కాగా, ఈ చిత్రానికి జె.యువరాజ్ సినిమాటోగ్రఫీని, జిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. శుక్రవారం ఈ చిత్రం నుంచి 'వాషి యో వాషి' అనే పాటను విడుదల చేశారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ పాడడం విశేషం. పవన్ 'అత్తారింటికి దారేది', 'జానీ' తదితర చిత్రాల్లో పాడి అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ గీతాన్ని వింటున్న అభిమానులు తెగ ఖుషీ అయిపోతున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక. పవన్ ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన పాత్రలో, ఇమ్రాన్ హష్మీ 'ఓమీ'గా ప్రతినాయకుడి రోల్‌లో కనిపించనున్నారు. ఈ నెల 21న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు మేకర్స్.

ఓజీ టికెట్ ధరల పెంపునకు అనుమతి

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 25న విడుదల కాబోతున్న ఈ భారీ బడ్జెట్ సినిమాకు రెండు వారాల పాటు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి కోరుతూ నిర్మాత డీవీవీ దానయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిశీలించిన ప్రభుత్వం పది రోజుల పాటు(అక్టోబరు 4వరకూ) అనుమతిచ్చింది. మొదటి రోజు బెనిఫిట్ షో టికెట్ రూ.1,000కి విక్రయించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్ర్కీన్ థియేటర్లలో రూ.125, మల్టీప్లెక్స్‌లలో రూ.150కు పెంచుకోవచ్చని ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌కు స్వల్ప గాయం



హైదరాబాద్‌లో జరుగుతోన్న ఓ ప్రైవేట్ యాడ్ షూటింగ్‌లో జూనియర్ ఎన్టీఆర్ కాలికి స్వల్ప గాయమైంది. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఆయన కింద పడిపోయారు. వెంటనే వ్యక్తిగత సిబ్బంది ఆయనను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ బృందం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. 'ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను అభిమానులు నమ్మొద్దు' అని పేర్కొంది.

ఆస్కార్‌కు హోమ్‌బౌండ్



బాలీవుడ్ చిత్రం 'హోమ్‌బౌండ్' అరుదైన ఘనతను సాధించింది. 2026లో జరిగే 98వ ఆస్కార్ అవార్డుల పోటీకి భారత్ నుంచి ఈ సినిమా 'ఉత్తమ విదేశీ చిత్రం' విభాగంలో అధికారికంగా ఎంపికైంది. స్నేహం, గౌరవం, బతుకుతెరువు వంటి అంశాలతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలూ, అవార్డులూ పొందడం విశేషం. ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులుగా 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలవుతోంది. కరన్ జోహార్, అపూర్వ మెహతా, అదర్ పూనావాల, సోమేన్ మిశ్రా నిర్మించారు.



కర్మను ఎవరూ తప్పించుకోలేరు

\- నాగ్ అశ్విన్





'కల్కి-2' ప్రాజెక్టు నుంచి దీపిక నిష్క్రమించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా దీపికా పదుకొణె వ్యవహార శైలిపై పోస్టులు కనిపిస్తున్నాయి. పారితోషికం కారణంగానే ఆమెను తప్పించినట్లు వార్తలు వస్తున్నాయి. కొందరు దీపికను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కల్కి 2898' చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పెట్టిన ఓ పోస్టు వైరల్ అయ్యింది. 'కర్మను ఎవరూ తప్పించుకోలేరు... నీ కర్మను నువ్వు అనుభవించాల్సిందే' అని అశ్వత్థామకు శ్రీకృష్ణుడు చెప్పిన సందేశాన్ని షేర్ చేశారు. దానితోపాటు 'జరిగిన దాన్ని ఎవరూ మార్చలేరు. కానీ, తర్వాత ఏం జరగాలో మీరు ఎంచుకోవచ్చు' అనే క్యాప్షన్ జోడించారు. దీంతో దీపికను ఉద్దేశించే నాగ్ అశ్విన్ ఈ పోస్టు పెట్టారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

ప్రేమకు మరణం లేదు

తేజ

రమణ సాకే, వనిత గౌడ జంటగా సత్య మార్క దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్స్ బేనర్‌పై సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్ చాలా బాగుంది. ఈ భూమి ఉన్నంత వరకు ప్రేమకు మరణం లేదు, ప్రేమ కథాంశంతో వచ్చే చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ ఉంటుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు సత్య మార్క మాట్లాడుతూ'ఈ సినిమా నేటి యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. అక్టోబరులో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు రమణ సాకే, కథానాయిక వనిత గౌడ తదితరులు మాట్లాడారు.



ఈ విజయం కొత్తవాళ్లకు స్ఫూర్తి

\- విజయ్ దేవరకొండ



'ఎవరి సహకారము లేకుండానే ఘన విజయం అందుకున్న 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం సభ్యులు మరెంతో మంది కొత్తవాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తారు. మనమూ సక్సెస్ అందుకోవచ్చనే ఒక పట్టుదల వారిలో కలుగుతుంది. అందుకే వీళ్లకు సపోర్ట్ చేయాలని అనిపించింది' అని అన్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ బేనర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ చిత్రబృందంతో ఒక సినిమా చేయాలని అనిపిస్తోంది. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ సినిమా గురించి నాకు చెప్పారు. మా సంస్థ ద్వారా రిలీజ్ చేశాం. భారీ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నేను చాలా రోజుల తర్వాత థియేటర్‌లో చూసిన సినిమా ఇది. సినిమా అంటే ఇలా ఉండాలి అని అనిపించింది' అని చెప్పారు. కార్యక్రమంలో నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి, చిత్ర దర్శకుడు సాయి మార్తాండ్, నటుడు రాజీవ్ కనకాల, నటి అనితా చౌదరి తదితరులు మాట్లాడారు.

వినోదాత్మకం



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా అక్టోబరు 18న చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులోని ప్రేమకథ, యాక్షన్ సన్నివేశాలు, సంభాషణలు ఆకట్టుకున్నాయి. కేరళ నేపథ్యంలో సాగే పూర్తిస్థాయి ఎంటర్టైనర్‌గా సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. సాయికుమార్, మురళీధర్ గౌడ్, శివన్నారాయణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, డీఓపీ: సతీశ్ రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్.

రచయిత ఆకెళ్ల కన్నుమూత



రచయిత, దర్శకుడు ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ గురువారం రాత్రి హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. చిరంజీవి నటించిన 'మగమహారాజు' రచయితగా ఆకెళ్లకు తొలి చిత్రం. అప్పటి నుంచి దాదాపు 80 చిత్రాలకు ఆయన కథ, మాటలు అందించారు. వీటిల్లో 'స్వాతిముత్యం', 'శ్రుతిలయలు', 'సిరివెన్నెల' 'శ్రీమతి ఒక బహుమతి', 'ఆయనకి ఇద్దరు', 'నాగదేవత', 'ఔనన్నా కాదన్నా' వంటి చిత్రాలు ఉన్నాయి. నరేశ్ నటించిన 'అయ్యయ్యో బ్రహ్మయ్య' చిత్రానికి ఆకెళ్ల దర్శకత్వం వహించారు కూడా. నాటక రచయితగా కూడా ఆకెళ్ల సుప్రసిద్ధులు. నాటక రచయితగా 13 సార్లు నంది అవార్డులు పొంది రికార్డులు నెలకొల్పారు. దాదాపు 200 కథలు, 20 నవలలు రాశారు. సీరియల్స్‌కు దాదాపు 800 ఎపిసోడ్స్ రాశారు. ఆకెళ్లకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

27 లిఫ్ట్ ఇరిగేషన్‌లకు రూ.26 కోట్లతో ప్రతిపాదనలు

బొల్లాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో 27 లిఫ్ట్ ఇరిగేషన్‌లకు రూ.26.20 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పీ భాగ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌ల కింద 25,394 ఎకరాలు ఆయకట్టు సాగవుతుందని, ఐతే వినుకొండ నియోజకవర్గంలో కొత్తగా ఆరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్‌కు వాటర్ అనుమతుల కోసం ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. ఈఈ వెంట రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.హనుమా నాయక్, వాసు నాయక్, ఎలిశల బాబు, అలెగ్జాండర్, వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.



ఈపూరు ఎంపీడీవోగా ఉమాదేవి బాధ్యతల స్వీకారం

ఈపూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈపూరు ఎంపీడీవోగా ఉమాదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె చేబ్రోలు నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాభివృద్ధికోసం ప్రజాప్రతినిధులతో కలసి పని చేస్తామన్నారు. ప్రజలు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

నేల స్వభావంపై అవగాహన

రొంపిచర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనాలను బట్టి ఎరువులను వాడాలని ఏవో శివలలిత శుక్రవారం తెలిపారు. మండలంలోని రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో 8, 9 తరగతి విద్యార్థులకు నేల స్వభావంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 మట్టి నమూనాలను విద్యార్థులతో తీయించారు. వాటి ఫలితాల పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవినాయక్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విప్పర్ల ఎస్సీ కాలనీ పాఠశాలలో స్వచ్ఛ పక్వాడా

రొంపిచర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విప్పర్లలోని ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాలలో గ్రీన్ స్కూల్ డ్రైవ్ డే కార్యక్రమం జరిగింది. నీటి యొక్క అవశ్యకతను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సత్యనారాయణ, మారుతీరావు, మల్లికార్జునరావు, లక్ష్మయ్య, గ్రామస్థులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నరసరావుపేటలోని ఐఈఈఈ ఇండస్ట్రీయల్ ఎలక్ట్రానిక్స్ సొసైటీ సూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ఆధ్వర్యంలో మ్యాట్‌లాబ్ అండ్ టూల్ బాక్సెస్‌పై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. వర్క్‌షాప్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొని ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి అంశాలపై శిక్షణపొందారు. ఆర్కెన్స్ సంస్థ ప్రొడక్ట్ పొన్నగంటి చందన వర్క్‌షాప్ నిర్వహించారు. ఐఈఈఈ ఐఈఎస్ సూడెంట్ చాప్టర్ అడ్వయిజర్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమం నిర్వహించేందుకు అవకాశం కల్పించిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నరసరావుపేట ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

నూజెండ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు ఓఆర్‌డబ్ల్యూ ఆషా అన్నారు. శుక్రవారం నూజెండ్ల జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ మత్తు పదార్థాలు, మానవుని ఆరోగ్యంపై చూపించే చెడుప్రభావాలను, వ్యాధుల గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

శావల్యాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ నుంచి పురస్కారాన్ని అందుకున్న గురుబాబును శావల్యాపురం జడ్పీ పాఠశాల్లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గురుబాబు, మాలతి దంపతులను హెచ్‌ఎం విజలయలక్ష్మి దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వినుకొండ రోటరీ క్లబ్ ద్వారా నేషన్ బిల్డర్ అవార్డు అందుకొన్న శ్రీనివాసరావును ఉపాధ్యాయులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎం ఎలిజబెత్‌కు సత్కారం

వేల్పూరు(శావల్యాపురం) సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఎలిజబెత్ అందించిన సేవలు అభినందనీయమని ఎంఈవో ఎం.సాంబశివరావు అన్నారు. వేల్పూరు బీసీకాలనీలోని ప్రాథమికపాఠశాల్లో హెచ్‌ఎంగా ఉద్యోగవిరమణ చేసిన ఎలిజబెత్ అభినందన సభ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లలితాకుమారి, ఎస్టీయూ నేత రాజారమేష్ పాల్గొన్నారు.

బొప్పూడి జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మార్టూరు చిలకలూరిపేట మధ్య బొప్పూడి జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై నుంచి విజయవాడకు వెళుతున్న టూరిస్ట్ బస్సు ఎదురుగా మోటార్ సైకిల్‌పై రాంగ్ రూటులో వచ్చిన వ్యక్తిని తప్పించబోయి ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొన్నది. ప్రమాదంలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన దేవగిరి సుబ్బారెడ్డి (35), చిలకలూరిపేటలో దిగటానికి ఇంజన్ వద్ద నిల్చుని ఉన్న నాదెండ్ల మండలం గోరిజవోలుకు చెందిన నల్లమాల సునీల్ (20) గాయపడ్డారు. చిలకలూరిపేట 108 సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స చేసి స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరాలతో మహిళల ఆరోగ్యం మెరుగు

● మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు

నాదెండ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శిబిరాలతో మహిళల ఆరోగ్యం మెరుగుపడుతుందని మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు అన్నారు. గణపవరం పీహెచ్‌సీలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ కవిత అనసూర్యదేవి మాట్లాడుతూ ఈ పథకం కింద ఈనెల 15 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పది రకాల వైద్యసేవలను మహిళలకు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రసాదు నాయక్ కోరారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణులు డాక్టర్ రావి సాంబశివరావు, గైనకాలజిస్టు డాక్టర్ లావు సుష్మలు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అచ్చయ్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు

పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమలతాదేవి, పక్కన డిప్యూటీ ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఏఈ బాలకుమార్



పంచాయతీ సిబ్బందితో పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది



వినుకొండ: శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, పీఎస్‌లు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్స్

వినుకొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఆదాయాన్ని పెంచి ప్రజలకు మెరుగైన పాలన కొనసాగించాలని ఎంపీడీవో పుట్టారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఆదాయ వనరులపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో టీవోటీ అలీషా మాట్లాడుతూ పంచాయతీల్లో ఇంటిపన్ను తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. నాన్ ట్యాక్స్ విధానం ద్వారా ఆదాయాన్ని పెంచుకొని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందర్‌రెడ్డి, పీఎస్‌లు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్స్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులను పెంపొందించుకోవడంపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో హేమలతాదేవి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదాయ వనరులు పెంపొందించుకోవడంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రారంభించి ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల బలోపేతానికి ఆర్థిక వనరుల సమీకరణ ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. డిప్యూటీ ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ పన్నుల వసూళ్ళలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలను సూచించారు. శిక్షణలో పంచాయతీరాజ్ ఏఈఈ బాలకుమార్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల స్వయం ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని ఎంపీడీవో పీ మాధురి అన్నారు. శుక్రవారం ఓన్ సోర్స్ రెవెన్యూ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో పీ మాధురి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఇంటిపన్నులు, నీటి పన్నులు, లైసెన్స్ ఫీజులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెలకు ఇవ్వటం ద్వారా ఆదాయ వనరులు పెంచు కోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, పీఆర్ ఏఈ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీబీసీకి నీటి పరిమాణం పెంచాలి

● డీఈకి డీసీ చైర్మన్ వినతి



పీబీసీ కాలువలో నీటి పరిమాణాన్ని పరిశీలిస్తున్న ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, ఎన్ఎస్‌పీ డీఈ బీ పూర్ణచందు

నూజెండ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీబీసీ కాలువకు నీటి పరిమాణం పెంచాలని ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి ఎన్ఎస్‌పీ డీఈ బీ పూర్ణచందులను కోరారు. శుక్రవారం ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, ముండ్లమూరు, దర్శి డీఈ బీ పూర్ణచందులు పీబీసీ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా బుల్లీశ్వరరెడ్డి మాట్లాడుతూ పీబీసీకి న్యాయంగా రావాల్సిన వాటా ఇవ్వాలని, కనీసం 650 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తేనే చివరి భూములకు సాగు నీరు వెళ్తుందన్నారు. మెట్ట ప్రాంతంలోని రైతులు మొక్కలు నాటుకునేందుకు నీటి ఆవశ్యకత ఉందన్నారు. ఈ విషయమై ప్రకాశం జిల్లా ఎన్ఎస్‌పీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

నూజెండ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వైద్యశాలలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ లగడపాటి వెంకటరావు, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఎంపీడీవో పీ ఉమాదేవి, వైద్యులు దీపిక, మంజూష తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు ఈ పోస్ యంత్రాలు పంపిణీ



ఈ పోస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సురేష్

వినుకొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్ అధ్యక్షతన శుక్రవారం డీలర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల్లో క్రమం తప్పకుండా నిరుపేదలకు రేషన్‌సరుకులు అందించాలని, ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఈ పోస్ యంత్రాలను డీలర్లకు అందజేశారు. గతంలో డీలర్ల వద్ద ఉన్న ఈ పోస్ యంత్రాలను కార్యాలయాల్లో అప్పగించాలన్నారు.

చిలకలూరిపేటలో మాజీ మంత్రి రజిని హౌస్ అరెస్టు



పిడుగురాళ్ల వెళ్ళనీయకుండా రజినీని అడ్డుకున్న పోలీసులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో పిడుగురాళ్ల కార్యక్రమానికి వెళ్ళనీయకుండా మాజీ మంత్రి విడదల రజినీని శుక్రవారం పట్టణ పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రజినీ మాట్లాడుతూ కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండించారు. ప్రజల గళాన్ని, పేదల హక్కుల కోసం చేసే పోరాటాన్ని ఎవరూ ఆపలేరన్నారు. మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. పీపీపీ విధానాన్ని ప్రభుత్వం తక్షణం వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆదర్శ పాఠశాలకు బోర్డు వితరణ



బోర్డు ఏర్పాటులో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది

నూజెండ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉప్పలపాడు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం బోర్డును టీడీపీ నాయకులు బత్తుల గోవిందరాజులు పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా బోర్డు ఏర్పాటు కార్యక్రమంలో టీడీపీ నాయకులు రొడ్డా నారాయణరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఎం.ఆంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పద్మారెడ్డి, నాగలక్ష్మి, లక్ష్మీగాయత్రి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రిక విడుదల చేస్తున్న ఆర్యవైశ్య పెద్దలు

వినుకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం కమిటీ వారు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి వచ్చే నెల రెండో తేదీవరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జొన్నలగడ్డ బాబ్జి, గౌరవ అధ్యక్షుడు తాతా వెంకటసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ అమర్నాథ్, రెడ్డి నగేష్‌బాబు, కోశాధికారి పెండ్యాల సురేష్, దారా మల్లికార్జునరావు, కొల్లిపర వెంకట నాగేశ్వరరావు, సదావర్తి సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు వాగ్దేవి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాజీపాలెం డీఎస్‌రాజు జూనియర్ కళాశాలలో ఈ నెల 17న జరిగిన అండర్-19 ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 15మంది స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో షాట్‌పుట్‌లో మొదటి, డిస్కస్ త్రోలో రెండో స్థానం జీ వెంకట నాగరాజు సాధించాడన్నారు. ఎం.అజయ్ 800మీటర్లు రన్నింగ్‌లో మొదటి స్థానం, ఎం.లీలా సంపత్ జావలిన్ త్రోలో మొదటి, టీ హరీష్ జావలిన్ త్రోలో రెండవ, షాట్‌పుట్‌లో రెండవ, జీ మనికంఠ లాంగ్ జంప్‌లో మూడో స్థానం, విష్ణు సాయిరాం డిస్కస్‌త్రోలో రెండవ, కే మనికంఠ హేమర్ త్రోలో మూడవ, యు శ్రీకాంత్ 100 మీటర్ల రన్నింగ్‌లో రెండవ, 1500 మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానం సాధించారన్నారు. కే శ్రీనివాస్ 400 మీటర్ల రన్నింగ్‌లో మూడవ, ఆర్.దుర్గాప్రసాద్ నాయక్ 800 మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానం పొందారు. బాలికల విభాగంలో యు ప్రవల్లిక 800 మీటర్ల రన్నింగ్‌లో మొదటి, కే లక్ష్మీసరిత షాట్‌పుట్‌లో రెండవ, జీ రిషి 400 మీటర్ల రన్నింగ్‌లో రెండవ, టీ రామాంజలి 200 మీటర్ల రన్నింగ్‌లో రెండవ, కే సౌమ్య 400 మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానం సాధించారు. స్టేట్‌మీట్‌కు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23, 24, 25 తేదీల్లో పశ్చిమ గోదావరిలో జరిగే స్టేట్ మీట్‌కి ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.



శావల్యాపురంలో యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ విశ్వనాథం

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ

● శావల్యాపురం సొసైటీ చైర్మన్ విశ్వనాథం

శావల్యాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరికీ యూరియాను అందజేస్తున్నామని శావల్యాపురం సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో అధికారులతో కలసి ఆయన రైతులకు శుక్రవారం యూరియాను పంపిణీ చేశారు. విశ్వనాథం మాట్లాడుతూ సొసైటీకి ప్రభుత్వం 880బస్తాల యూరియా పంపించగా రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులు అవసరాన్ని బట్టి దశలవారీగా ఎరువులు తీసుకోవాలని, రైతులు పొలాల్లో నానో యూరియా, నానో డీఏపీలు వాడితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం శావల్యాపురం సొసైటీలో ఎరువులు పంపిణీని వినుకొండ ఏడీఏ రవికుమార్ పరిశీలించారు. యూరియా కోసం రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో ప్రభుత్వం నియోజకవర్గానికి సమృద్ధిగా యూరియాను అందజేయనుందన్నారు. ఇన్‌చార్జి ఎంఏవో రామారావు, ఎస్ఐ లోకేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ నాగరాజు, సీఈవో నాగప్రసాద్ పాల్గొన్నారు.

మక్కెనకు జన్మదిన శుభాకాంక్షలు



మక్కెనను సత్కరిస్తున్న కూటమి నాయకులు

వినుకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జీడీసీసీ బ్యాంక్ చైర్మన్, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు జన్మదినం సందర్భంగా వినుకొండకు చెందిన కూటమి నాయకులు గుంటూరులోని చైర్మన్ కార్యాలయంలో మక్కెనను శుక్రవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాల్‌మిలర్స్ అసోసియేషన్ పెండేల సురేష్, శావల్యాపురం మండల సొసైటీ అధ్యక్షుడు గడిపూడి విశ్వనాథం, బీజేపీ నాయకుడు యార్లగడ్డ లెనిన్, టీడీపీ నాయకుడు బోడెపూడి నాగేశ్వరరావు, నలబోతుల శ్రీను పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో ఉచిత న్యాయ సాయం

● 13వ అదనపు జిల్లా న్యాయధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మధ్య ఆదాయ వర్గాల వారికి సుప్రీం కోర్టులో ఉచిత న్యాయసాయం అందించనున్నట్లు స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయ అధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టులో ఉన్న సుప్రీంకోర్టు మిడిల్ ఇన్కమ్ గ్రూప్ లీగల్ ఎయిడ్ సొసైటీ ద్వారా సాయం అందించనున్నట్లు ఆమె తెలిపారు. సంవత్సరానికి రూ.12లక్షల రూపాయలలోపు ఆదాయం ఉన్నవారు ఈ స్కీంకు అర్హులన్నారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

శివాపురంలో స్వచ్ఛతా హీ సేవ



చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం యలమంద

వినుకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శివపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ కమతం సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం, విద్యార్థులతో ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ ప్రభాకర్‌రావు, అసిస్ట్ కో ఆర్డినేటర్ ఏసోబు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మేడిపల్లి రక్షణ, భార్గవి, విజయ, పార్వతీపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నాగువరం గ్రామంలో పాఠశాల హెచ్‌ఎం బి.యలమంద ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ అంకారావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థుల ఎంపిక



ఎం.శివసాయి శ్రీకర్



బీ రవి కుమార్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్‌లో తైక్వాండో గుంటూరు జిల్లా జట్టుకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి శుక్రవారం తెలిపారు. 68 కేజీల విభాగంలో కళాశాలకు చెందిన ఎం.శివసాయి శ్రీకర్, 51 కేజీల క్యాటగిరిలో బీ రవికుమార్ ప్రథయ స్థానంలో నిలిచారన్నారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన ఎం.శివసాయిశ్రీకర్, బీ రవికుమార్‌లను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకటఅప్పారావు, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపకులు అభినందించారు.

స్వల్ప వివాదంలో ఘర్షణ... ఒకరికి గాయాలు

నరసరావుపేట లీగల్, సెప్టెంబర్ 19, (ఆంధ్రజ్యోతి): స్వల్ప వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడ్డ సంఘటనపై కేసు నమోదైంది. మొదటి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని తిలక్ స్కూల్ వద్ద హైస్కూల్ విద్యార్థులు ట్యూషన్ నుంచి గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా మేక నాగరాజు అనే వ్యక్తి సెల్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఓ విద్యార్థి తన మిత్రుల కోసం పెద్దగా పిలిచాడు. దీంతో నాగరాజు ఆ బాలుడిని దూషించాడు. ఈ విషయాన్ని తండ్రి స్కైలాబ్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీనిపై స్కైలాబ్ నాగరాజును ప్రశ్నించటంతో ఘర్షణ జరిగింది. దీంతో నాగరాజు స్కైలాబ్‌ను నెట్టడంతో రైలింగ్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరి పోలీసులకు స్కైలాబ్ సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'మదనపల్లె ఫైల్స్' కేసులో

మాజీ ఆర్డీవో మురళి అరెస్టు

» చిత్తూరు కోర్టులో హాజరు.. 3 వరకు రిమాండ్

తిరుపతి(నేరవిభాగం)/చిత్తూరు లీగల్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మదనపల్లె ఫైల్స్' కేసులో మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ముందస్తు బెయిల్‌ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తిరుపతిలోని ఇంట్లో ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిత్తూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరచగా, వచ్చేనెల 3వ తేదీవరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి బాబాజాన్ ఆదేశాలిచ్చారు. దీంతో పోలీసులు మురళిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో గతేడాది జూలై 21వ తేది రాత్రి మంటలు చెలరేగి డాక్యుమెంట్లు కాలిపోయిన విషయం తెలిసిందే.

ధరలేక ఉల్లి రైతు దైన్యం: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బెనిఫిట్ షోలకు టికెట్ ధర రూ.వెయ్యికి పెంచడంలో ఉన్న శ్రద్ధ.. ఉల్లి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం కూటమి ప్రభుత్వానికి లేదు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం అన్నారు. 'ఉల్లి రైతును ప్రభుత్వం నిండా ముంచేసింది. రైతుకంట కన్నీళ్లు పెట్టించిన పాపం సీఎం చంద్రబాబుదే. ధరలేక దైన్యంగా ఉన్న ఉల్లిరైతు కళ్లల్లో ఆనందం ఎక్కడుంటుంద'ని షర్మిల ప్రశ్నించారు.

పనితీరు బాలేదంటూ వీఆర్వోలతో గుంజీలు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పనితీరు బాగలేని వీఆర్వోల చేత శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ గుంజీలు తీయించారు. ఈనెల 18న పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఆర్డీఓపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వీఆర్వోలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆర్డీఓతో మాట్లాడుతానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

రాష్ట్రీయ జన సంక్షేమ సేన స్థాపన: చేగొండి

పాలకొల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణం కేంద్రంగా రాష్ట్రీయ జన సంక్షేమ సేన అనే నూతన సామాజిక సంస్థను ఏర్పాటు చేసినట్టు మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య శుక్రవారం ప్రకటించారు.

ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లండి

» వైసీపీ నేత ప్రతాప్‌కుమార్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కావలి టీడీపీ ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి హత్యకు ప్రణాళిక రచించారనే ఆరోపణలపై నమోదైన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టును ఆశ్రయించేందుకు ఆయనకు వెసులుబాటు ఇచ్చింది. ఉత్తర్వుల ప్రతి అందిన నాలుగువారాల్లో కింది కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. అప్పటివరకు ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఆదేశించారు.

కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్ల కొట్టివేత

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడంపై నమోదైన కేసులో ఇద్దరు నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ కేసులో ఏ13 బోలేబాబా కంపెనీ ఆపరేటర్ సంజయ్‌చౌహాన్, ఏ8 షమీ ఉల్లాఖాన్ నెల్లూరు జిల్లా ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లను దాఖలు చేశారు. దీనిపై ఈనెల 16న జరిగిన విచారణలో ప్రభుత్వం తరఫున ప్రత్యేక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనల అనంతరం నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టి వేస్తూ కోర్టు తీర్పునిచ్చింది.


శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళంలో హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి

» అభినందనలు తెలిపిన మంత్రి లోకేశ్

శ్రీకాకుళం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. చాలా సమయం పాఠశాలలో గడిపిన ఆయన స్పందిస్తూ... 'నేను ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను దత్తత తీసుకుంటున్నా. హైస్కూల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా' అని ప్రకటించారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందించారు. హైస్కూల్‌ను దత్తత తీసుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు అభినందనలు తెలిపారు. ఇదే రీతిన వివిధ వర్గాలు పాఠశాలల అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు. అందరం కలసి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఆదర్శంగా నిలుపుదామంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

సంక్షేమాధికారి బూతుపురాణం

» ఉద్యోగులకు దూషణలు, వార్నింగ్‌లు
» మహిళా అధికారులపైనా ఇదే తీరు
» వారి దుస్తులపై వ్యాఖ్యలు
» తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి నిర్వాకం
» విద్యార్థినులపైనా హేయమైన భాష
» గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేల ఫిర్యాదు
» శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తానన్న మంత్రి డోలా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులను బూతులు తిట్టడం, ఉద్యోగం తీసేయిస్తానంటూ వార్నింగ్‌లు ఇవ్వడం, మహిళా ఉద్యోగులనీ చూడకుండా అసభ్యంగా మాట్లాడటం, డ్రెస్సులపై కామెంట్లు చేయడం, చివరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపైనా నోరు పారేసుకోవడం... ఇదీ తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌రెడ్డి తీరు. తిరుపతి జిల్లాలో సాంఘిక సంక్షేమ హస్టళ్లను గాడిలో పెడతారని రాష్ట్ర ప్రభుత్వం సదుద్దేశంతో ఆ మధ్య నియమించిన ఆ అధికారి హద్దుమీరి ప్రవర్తిస్తున్నారు. ఆయన చేస్తున్న వింత, విచిత్ర విన్యాసాలు ఇటు సిబ్బందికి, అటు విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. విక్రమ్‌రెడ్డి వ్యవహారశైలిపై ఏపీ స్టేట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా యూనిట్ ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మరింత రెచ్చిపోతున్నారు. ఫిర్యాదు చేసిన సిబ్బందిపైనే గాక ఎమ్మెల్యేలపైనా నోరుపారేసుకున్నారని చెబుతున్నారు. జూమ్ మీటింగ్‌ల్లో సైతం ఉద్యోగులపై బూతుపురాణాలు మొదలు పెట్టారు. హాస్టళ్లలో ఉండే బాలికలు, అధికారుల పట్ల నోటికొచ్చినట్లు దూషణలకు దిగుతున్నారు. తనపై ఫిర్యాదు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని, శాశ్వతంగా ఉద్యోగాలకు దూరమవుతారని బెదిరిస్తున్నారు. తనకు మంత్రి పేషీ అధికారులు తెలుసని, కలెక్టర్ మిత్రుడని, ఏసీబీ అధికారులు తనకు సీనియర్లని పదే పదే బెదిరిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. తిరుపతి జిల్లాకు అధికారిగా నియమించినప్పటి నుంచి ఆయన వైఖరి ఇలాగే ఉందని అంటున్నారు. పత్రికలో రాయలేని రీతిలో బూతులు తిడుతున్నారని వాపోతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మహిళా ఉద్యోగులు, బాలికలు మంచివాళ్లు కాదంటూ పదే పదే కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ హాస్టళ్లలో చదివే విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల పట్ల కూడా అనుచితంగా మాట్లాడటం ఆయనకు పరిపాటిగా మారిందంటున్నారు. ప్రతి సందర్భంలోనూ కలెక్టర్ తనకు బాగా దగ్గరని, ఏసీబీ డీఎస్పీ తనకు సీనియర్ అని, అందరి జాతకాలు తీస్తానని బెదిరిస్తున్నారని, తాము ఉద్యోగాలు మానేసుకోవాలని అనిపిస్తోందని పలువురు మహిళా అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతస్థాయి సమావేశంలో కలెక్టర్ ఆయనను వెనకేసుకు రావడంతో మరింత రెచ్చిపోతున్నారు. కలెక్టర్ ఆయనకు ఎస్సీ కార్పొరేషన్ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్పచెప్పడంతో దానికి సంబంధించిన పనులు కూడా హాస్టల్ అధికారులకు అప్పగిస్తూ వారిపై స్వారీ చేస్తున్నారు. ఆయన మాటకు ఎవరైనా ఎదురు తిరిగితే అంతే సంగతులు. షోకాజ్ నోటీసులు, మెమోలు ఇస్తానని, సస్పెండ్ చేస్తానని బెదిరింపులు ఎక్కువయ్యాయని చెబుతున్నారు. ఇటీవల బదిలీల సందర్భంగా కూడా సిబ్బందిని ఇష్టం వచ్చినట్లు ఆడుకున్నారని, నాలుగో తరగతి సిబ్బంది అంటే ఈ అధికారికి చిన్నచూపని, ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని ఆరోపిస్తున్నారు. హాస్టల్ మహిళా అధికారుల డ్రెస్సులపై కామెంట్లు చేయడం, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని చెబుతున్నారు. తన బూతుపురాణం ఎవరైనా రికార్డు చేస్తారేమోనన్న అనుమానంతో ఆయన ఆంక్షలు పెడుతున్నారు. ఈ అధికారి వద్దకు వెళ్లాలంటే ఉద్యోగులు ఫోన్లు బయట పెట్టి పోవాల్సిందేనట. తిరుపతి, చిత్తూరు జిల్లాల వారికి కలిపి జూమ్ మీటింగ్ పెట్టినప్పుడు వసతి గృహాలలో జరిగిన చిన్నచిన్న సంఘటనలు ప్రస్తావించి, సిబ్బందిని అవహేళన చేసి పైశాచిక ఆనందం పొందారని ఆరోపిస్తున్నారు. తిరుపతి జిల్లా ఏసీబీ, విజిలెన్స్ అధికారులు తనకు మిత్రులని, వారికి చెప్పి విచారణ జరిపించి అంతుచూస్తానని, ఉద్యోగాలు లేకుండా చేస్తానని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ప్రొటోకాల్ ఖర్చులు ఇవ్వని హాస్టల్ అధికారులకు చుక్కలు చూపిస్తానంటూ వార్నింగ్ ఇస్తున్నారు.

మంత్రికి ఎమ్మెల్యేల ఫిర్యాదు

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతికి వచ్చిన ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్.. సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌రెడ్డిపై మంత్రికి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఈ అధికారి నిర్వాకంపై ఫిర్యాదు చేశారు. పేద ఎస్సీ విద్యార్థులను పర్యవేక్షించాల్సిన అధికారిగా ఇలాంటివారిని నియమించడం వల్ల హాస్టళ్లు మరింత దిగజారుతున్నాయని ఎమ్మెల్యేలు అన్నారు. ఈ అధికారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తామని, ఆయన స్థానంలో మరో అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

హాయ్‌ల్యాండ్‌లో దిద్దేందుకు కోటి ఖర్చు!

» డిజిటల్-మాన్యువల్ మూల్యాంకనాల్లో పెద్ద తేడా
» 62 శాతం మంది మాన్యువల్‌లో ఎంపిక కాలేదు
» తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు ధర్మాసనం



అమరావతి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దు చేసి, తాజాగా పరీక్ష నిర్వహించాలని ఏపీపీఎస్సీ, పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఇరుపక్షాలలో ఎవరైన రాతపూర్వక వాదనలు దాఖలు చేయాలనుకుంటే సోమవారంలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించింది. అయితే, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని అప్పటి విచారణలోనే న్యాయమూర్తి నిర్ధారించారు. దీంతో 2022, మే 26న ఇచ్చిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష అర్హుల జాబితాను హైకోర్టు సింగిల్ జడ్జి రద్దు చేశారు. తాజాగా మెయిన్స్ నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని 2024, మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు అప్పీల్ చేశారు. మరికొందరు.. సింగిల్ జడ్జి తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ వేశారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు తుది విచారణ ప్రారంభించింది. గురువారం ప్రారంభమైన వాదనలు శుక్రవారం కొనసాగాయి. ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు జంధ్యాల రవిశంకర్, కేఎస్ మూర్తి, న్యాయవాదులు జొన్నలగడ్డ సుధీర్, షేక్ సలీమ్ వాదనలు వినిపించారు. డిజిటల్ విధానంలో జరిగిన మూల్యాంకనంలో ఎంపికైన అభ్యర్థులలో 62శాతం మంది తదుపరి జరిపిన మాన్యువల్ మూల్యాంకనంలో ఎంపిక కాలేదన్నారు. తెలుగు మాధ్యమంలో పరీక్షరాసిన అభ్యర్థులే ఎక్కువ నష్టపోయారని తెలిపారు. డిజిటల్ మూల్యాంకనంలో ఎంపికకాని అభ్యర్థులు, మాన్యువల్ మూల్యాంకనంలో మంచి పోస్టులు పొందారని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా మాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసేందుకు జవాబు పత్రాలను 'హాయ్‌ల్యాండ్'కు తరలించారని, మాన్యువల్ మూల్యాంకనాన్ని థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించారని తెలిపారు. అయితే, ఇలా ఇవ్వడాన్ని ఏపీపీఎస్సీలోని ఓ సభ్యుడు వ్యతిరేకించారన్నారు. ఈ అభ్యంతరాలను అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పట్టించుకోలేదని, స్ట్రాంగ్ రూమ్ నుండి జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించడం అనుమానించాల్సిన విషయమని వివరించారు. 2021, డిసెంబరు- 2022, ఫిబ్రవరి మధ్య హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందని, దీనికిగాను అదనంగా బార్‌కోడ్లు, ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్‌ను ప్రింట్ చేయించారని తెలిపారు. అయితే ఆ ఫలితాలను ప్రకటించలేదన్నారు. "హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం కోసం మొత్తం రూ.1.19 కోట్లు ఖర్చు చేశారు. డిజిటల్ మూల్యాంకనం, మాన్యువల్ మూల్యాంకనంలో కొద్దిశాతం మాత్రమే వ్యత్యాసం ఉందని, త్వరలో ఫలితాలు ప్రకటిస్తామని అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రకటించారు. వీటన్నిటినీ పరిశీలిస్తే హాయ్‌ల్యాండ్ వేదికగా పేపర్లు దిద్దారనేది స్పష్టమవుతోంది. కొన్ని జవాబుపత్రాలలో రెండు చేతిరాతలు ఉన్న వ్యవహారంపై దర్యాప్తు కమిటీ ఏం తేల్చిందో స్పష్టత లేదు. మెయిన్స్ రద్దు చేసి తాజాగా పరీక్ష నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వండి. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి లేదా సీబీఐ లేదా ఏదైనా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని నిర్ణయానికి వస్తే... అధికారులుగా వివిధ హోదాల్లో ఉన్న అభ్యర్థులను ఆ స్థానాల నుండి తొలగించండి." అని వాదనలు వినిపించారు.

వారు ఎంపిక కాలేదు: ఏజీ

ఈ సందర్భంగా ధర్మాసనం అడిన పలు ప్రశ్నలకు ఏపీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ బదులిస్తూ.. రెండు రకాల చేతిరాతలు ఉన్న జవాబుపత్రాల అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలో ఎంపిక కాలేదన్నారు. రెండు చేతిరాతల వ్యవహారాన్ని తేల్చేందుకు ఏపీపీఎస్సీ కమిటీ వేసిందని, కమిటీ నివేదికను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. కోర్టు తుది తీర్పుకి లోబడి ఉంటామని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు హామీ పత్రం ఇచ్చారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, పి. శ్రీరఘురాం, ఓ. మనోహర్‌రెడ్డి రిప్లై వాదనలు వినిపించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



మోటార్ బైక్ రేసర్‌గా శర్వా

శర్వానంద్ కథానాయకుడిగా అభిలాష్ కంకర దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. మాళవిక నాయర్ కథానాయిక. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో శర్వానంద్ మంచి నైపుణ్యాలున్న మోటార్ బైక్ రేసర్‌గా కనిపించబోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోన్న షూటింగ్‌లో శర్వా బృందంపై రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. కాగా, ఈ చిత్రానికి జె.యువరాజ్ సినిమాటోగ్రఫీని, జిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

ప్రేమకు మరణం లేదు

తేజ

రమణ సాకే, వనిత గౌడ జంటగా సత్య మార్క దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సాకే రామయ్య సమర్పణలో సిద్ధ క్రియేషన్స్ బేనర్‌పై సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్ చాలా బాగుంది. ఈ భూమి ఉన్నంత వరకు ప్రేమకు మరణం లేదు, ప్రేమ కథాంశంతో వచ్చే చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ ఉంటుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు సత్య మార్క మాట్లాడుతూ'ఈ సినిమా నేటి యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. అక్టోబరులో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు రమణ సాకే, కథానాయిక వనిత గౌడ తదితరులు మాట్లాడారు.





పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. శుక్రవారం ఈ చిత్రం నుంచి 'వాషి యో వాషి' అనే పాటను విడుదల చేశారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ పాడడం విశేషం. పవన్ 'అత్తారింటికి దారేది', 'జానీ' తదితర చిత్రాల్లో పాడి అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ గీతాన్ని వింటున్న అభిమానులు తెగ ఖుషీ అయిపోతున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక. పవన్ ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన పాత్రలో, ఇమ్రాన్ హష్మీ 'ఓమీ'గా ప్రతినాయకుడి రోల్‌లో కనిపించనున్నారు. ఈ నెల 21న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు మేకర్స్.

ఓజీ టికెట్ ధరల పెంపునకు అనుమతి

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 25న విడుదల కాబోతున్న ఈ భారీ బడ్జెట్ సినిమాకు రెండు వారాల పాటు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి కోరుతూ నిర్మాత డీవీవీ దానయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిశీలించిన ప్రభుత్వం పది రోజుల పాటు(అక్టోబరు 4వరకూ) అనుమతిచ్చింది. మొదటి రోజు బెనిఫిట్ షో టికెట్ రూ.1,000కి విక్రయించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్ర్కీన్ థియేటర్లలో రూ.125, మల్టీప్లెక్స్‌లలో రూ.150కు పెంచుకోవచ్చని ఏపీ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ విజయం కొత్తవాళ్లకు స్ఫూర్తి

- విజయ్ దేవరకొండ



'ఎవరి సహకారము లేకుండానే ఘన విజయం అందుకున్న 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం సభ్యులు మరెంతో మంది కొత్తవాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తారు. మనమూ సక్సెస్ అందుకోవచ్చనే ఒక పట్టుదల వారిలో కలుగుతుంది. అందుకే వీళ్లకు సపోర్ట్ చేయాలని అనిపించింది' అని అన్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ బేనర్‌పై ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇటీవలె సినిమా విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ చిత్రబృందంతో ఒక సినిమా చేయాలని అనిపిస్తోంది. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ సినిమా గురించి నాకు చెప్పారు. మా సంస్థ ద్వారా రిలీజ్ చేశాం. భారీ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నేను చాలా రోజుల తర్వాత థియేటర్‌లో చూసిన సినిమా ఇది. సినిమా అంటే ఇలా ఉండాలి అని అనిపించింది' అని చెప్పారు. కార్యక్రమంలో నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి, చిత్ర దర్శకుడు సాయి మార్తాండ్, నటుడు రాజీవ్ కనకాల, నటి అనితా చౌదరి తదితరులు మాట్లాడారు.

వినోదాత్మకం



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా అక్టోబరు 18న చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులోని ప్రేమకథ, యాక్షన్ సన్నివేశాలు, సంభాషణలు ఆకట్టుకున్నాయి. కేరళ నేపథ్యంలో సాగే పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. సాయికుమార్, మురళీధర్ గౌడ్, శివన్నారాయణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, డీఓపీ: సతీశ్ రెడ్డి మాసం, సంగీతం: చేతన్ భరద్వాజ్.

ఎన్టీఆర్‌కు స్వల్ప గాయం



హైదరాబాద్‌లో జరుగుతోన్న ఓ ప్రైవేట్ యాడ్ షూటింగ్‌లో జూనియర్ ఎన్టీఆర్ కాలికి స్వల్ప గాయమైంది. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఆయన కింద పడిపోయారు. వెంటనే వ్యక్తిగత సిబ్బంది ఆయనను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. ఈ ప్రమాదంపై ఎన్టీఆర్ బృందం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. ఆయన ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారు. 'ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాలను అభిమానులు నమ్మొద్దు' అని పేర్కొంది.

కర్మను ఎవరూ తప్పించుకోలేరు

- నాగ్ అశ్విన్





'కల్కి-2' ప్రాజెక్టు నుంచి దీపిక నిష్క్రమించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా దీపికా పదుకొణె వ్యవహార శైలిపై పోస్టులు కనిపిస్తున్నాయి. పారితోషికం కారణంగానే ఆమెను తప్పించినట్లు వార్తలు వస్తున్నాయి. కొందరు దీపికను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా, మరికొందరు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కల్కి 2898' చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పెట్టిన ఓ పోస్టు వైరల్ అయ్యింది. 'కర్మను ఎవరూ తప్పించుకోలేరు... నీ కర్మను నువ్వు అనుభవించాల్సిందే' అని అశ్వత్థామకు శ్రీకృష్ణుడు చెప్పిన సందేశాన్ని షేర్ చేశారు. దానితోపాటు 'జరిగిన దాన్ని ఎవరూ మార్చలేరు. కానీ, తర్వాత ఏం జరగాలో మీరు ఎంచుకోవచ్చు' అనే క్యాప్షన్ జోడించారు. దీంతో దీపికను ఉద్దేశించే నాగ్ అశ్విన్ ఈ పోస్టు పెట్టారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

ఆస్కార్‌కు హోమ్‌బౌండ్



బాలీవుడ్ చిత్రం 'హోమ్‌బౌండ్' అరుదైన ఘనతను సాధించింది. 2026లో జరిగే 98వ ఆస్కార్ అవార్డుల పోటీకి భారత్ నుంచి ఈ సినిమా 'ఉత్తమ విదేశీ చిత్రం' విభాగంలో అధికారికంగా ఎంపికైంది. స్నేహం, గౌరవం, బతుకుతెరువు వంటి అంశాలతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలూ, అవార్డులూ పొందడం విశేషం. ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులుగా 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలవుతోంది. కరన్ జోహార్, అపూర్వ మెహతా, అదర్ పూనావాల, సోమేన్ మిశ్రా నిర్మించారు.



రచయిత ఆకెళ్ల కన్నుమూత



రచయిత, దర్శకుడు ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ గురువారం రాత్రి హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. చిరంజీవి నటించిన 'మగమహారాజు' రచయితగా ఆకెళ్లకు తొలి చిత్రం. అప్పటి నుంచి దాదాపు 80 చిత్రాలకు ఆయన కథ, మాటలు అందించారు. వీటిల్లో 'స్వాతిముత్యం', 'శ్రుతిలయలు', 'సిరివెన్నెల' 'శ్రీమతి ఒక బహుమతి', 'ఆయనకి ఇద్దరు', 'నాగదేవత', 'ఔనన్నా కాదన్నా' వంటి చిత్రాలు ఉన్నాయి. నరేశ్ నటించిన 'అయ్యయ్యో బ్రహ్మయ్య' చిత్రానికి ఆకెళ్ల దర్శకత్వం వహించారు కూడా. నాటక రచయితగా కూడా ఆకెళ్ల సుప్రసిద్ధులు. నాటక రచయితగా 13 సార్లు నంది అవార్డులు పొంది రికార్డులు నెలకొల్పారు. దాదాపు 200 కథలు, 20 నవలలు రాశారు. సీరియల్స్‌కు దాదాపు 800 ఎపిసోడ్స్ రాశారు. ఆకెళ్లకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయి.